నేడు యధావిధిగా పిజిఆర్ఎస్

జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఈ నెల ఒకటో తేదీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమం యధావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఈ నెల ఒకటో తేదీ సోమవారం సిఎం జిల్లాలో పర్యటించనున్న దృష్ట్యా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, వివిధ శాఖల జిల్లా అధికారులు జిల్లా కలెక్టరేట్‌లో జరగనున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అందుబాటులో ఉండరని పేర్కొన్నారు. పిజిఆర్ఎస్ కార్యక్రమం యధావిధిగా నిర్వహిస్తారని, జిల్లా రెవెన్యూ అధికారి, వివిధ శాఖల అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సిఎం సారూ.. వరిసాగు నేరమా..!

కొల్లేరు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న అటవీ శాఖాధికారులు

వందల ఏళ్ల నుంచి వరిసాగు చేస్తున్నా పొలాలకు రాకుండా ఆంక్షలు

ఆ భూములన్నీ సన్న, చిన్నకారు రైతుల చేతుల్లోనే

ఉంగుటూరు నియోజకవర్గంలోనే దాదాపు 3 వేల ఎకరాల్లో సాగు

ఏలూరు, పశ్చిమలో లక్షా 40 వేల మందికి కౌలుకార్డులు

'అన్నదాత సుఖీభవ' కింద చిల్లిగవ్వ ఇవ్వని పరిస్థితి

అన్ని స్థానాల్లో గెలిపిస్తే ఇదేనా గిఫ్ట్ అంటూ అన్నదాత ఆవేదన

నేడు ఉంగుటూరు మండలంలో సిఎం పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సిఎం సారూ.. వరి సాగు చేయడం నేరమా.. వందల ఏళ్ల నుంచి వరిసాగు చేసుకుంటున్న కొల్లేరును ఆనుకుని ఉన్న భూముల్లోకి రైతులను వెళ్లనీయకుండా అటవీ శాఖాధికారులు అడ్డుకోవడం ఎంత వరకూ న్యాయం. ఏడాదికి ఒక్క పంట పండే ఆ భూములే పేద రైతులకు ఆధారం. 'రబీ సాగు సమయం ఆసన్నమవుతున్న తరుణంలో అటవీ శాఖాధికారుల తీరు అత్యంత దారుణంగా ఉంది. 'మాకు న్యాయం చేయండి' అంటూ ఉంగుటూరు నియోజకవర్గంతోపాటు కొల్లేరును ఆనుకుని వరిసాగు చేసుకుంటున్న రైతులంతా సిఎంను కోరుతున్నారు. సోమవారం ఉంగుటూరు మండలంలో సిఎం పర్యటన నేపథ్యంలో కొల్లేరు రైతులంతా తమ ఆవేదనను సిఎం దృష్టికి తీసుకెళ్లాలని

సిఎం పర్యటన కోసం ఏర్పాటు చేసిన హెలీప్యాడ్

ప్రజాప్రతినిధులను, జిల్లా ఉన్నతాధికారులను కోరుతున్నారు.

ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్ల పంపిణీలో సిఎం చంద్రబాబు ఏదోక జిల్లాలో పాల్గొంటున్నారు. డిసెంబర్ నెలలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సోమవారం సిఎం చంద్రబాబు ఉంగుటూరు మండలంలో పాల్గొనున్నారు. దీంతో ఆ ప్రాంత రైతులంతా తమ సమస్యలకు పరిష్కారం చూపాలని సిఎంను కోరుతున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలుతోపాటు దెందులూరు, ఏలూరు మండలాల్లోనూ కొల్లేరును ఆనుకుని ఉన్న భూముల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. 1980 ప్రాంతంలో అప్పటి ప్రభుత్వమే కొల్లేరును ఆనుకుని ఉన్న భూములను సొసైటీ పేరుతో పేదలకు ఇచ్చింది. తర్వాత కాలంలో చాలా గ్రామాల్లో చేపల చెరువులు తవ్వగా 2005లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో అప్పటి ప్రభుత్వం ధ్వంసం చేసింది. నిడమర్రు, ఉంగుటూరు మండలాల్లోని పలు గ్రామాల్లో మాత్రం ఇప్పటికీ వ్యవసాయం సాగు చేస్తున్నారు. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం సాంప్రదాయ వ్యవసాయం చేసుకునే అవకాశం ఉంది. నిడమర్రు మండలం అడవికొలనులో 750 ఎకరాల వరకూ అన్‌సర్వే భూమి ఉండగా, పెదనింద్రకొలను, తోకలపల్లి, బైనేపల్లి వంటి గ్రామాలతోపాటు ఉంగుటూరు మండలం అప్పారావుపేట వంటి గ్రామాల్లోనూ అన్‌సర్వే భూములు ఉన్నాయి. ఉంగుటూరు నియోజకవర్గంలో దాదాపు మూడు వేల ఎకరాల వరకూ అన్‌సర్వే భూములు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ భూములన్నీ చిన్న, సన్నకారు రైతుల చేతుల్లోనే ఉన్నాయి. వందల ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి ఇబ్బందీ లేదు. ప్రస్తుత రబీలో ఆ పంట పొలాల్లోకి వెళ్లనీయకుండా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కొద్ది రోజుల క్రితం ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద వేలాది మంది రైతులు ఆందోళన చేసిన పరిస్థితి ఉంది. స్థానిక ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెబుతున్నా పరిస్థితిలో మాత్రం మార్పు రాలేదు. రెండు రోజుల క్రితం తోకలపల్లి గ్రామంలో రైతులను అటవీశాఖ అధికారులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. సిఎం జోక్యం చేసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కొల్లేరు రైతులు కోరుతున్నారు.

కౌలురైతులకు 'అన్నదాత సుఖీభవ' ఏదీ..!

తాము అధికారంలోకి వస్తే కౌలురైతులకు న్యాయం చేస్తామని గడిచిన ఎన్నికల్లో కూటమి చెప్పింది. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటిపోయింది. రెండు జిల్లాల్లో మూడు లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వం నిర్ధారించిన లెక్కలే ఇవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కౌలురైతుల సంఖ్య కుదించేసిన పరిస్థితి ఉంది. ఏలూరు జిల్లాలో 75 వేల మందికి, పశ్చిమలో లక్షా ఐదు వేల మందికి మాత్రమే కౌలు కార్డులు ఇవ్వాలని అధికారులు టార్గెట్ నిర్దేశించారు. ఈ ఏడాది రెండు జిల్లాల్లో లక్షా 40 వేల మందికి కౌలు కార్డులు అందించినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. అన్నదాత సుఖీభవ కింద ప్రభుత్వం ఏడాదికి రూ.20 వేలు అందిస్తామని హామీ ఇచ్చింది. కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వమే ఆ మొత్తాన్ని చెల్లిస్తుందని ప్రకటించింది. ఇప్పటి వరకూ రెండు విడతలుగా అన్నదాత సుఖీభవ సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ సొమ్ము అందుకున్నవారిలో ఒక్క కౌలురైతూ లేడు. ప్రభుత్వం కౌలుకార్డులు జారీ చేసిన లక్షా 40 వేల మందిలో ఒక్కరికీ అన్నదాత సుఖీభవ సొమ్ము అందలేదు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో అత్యధికంగా కౌలురైతులు ఉండటంతో గడిచిన ఎన్నికల్లో అంతా కూటమివైపు నిలబడ్డారు. దీంతో రెండు జిల్లాల్లోని 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలను కూటమి కైవసం చేసుకుంది. తీరా అధికారంలోకి వచ్చాక కౌలురైతులను పట్టించుకోని పరిస్థితి కన్పిస్తోంది. కౌలురైతులకు వెంటనే అన్నదాత సుఖీభవ సొమ్ము అందించాలని డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం, బీమా సైతం అందేలా చర్యలు తీసుకోవాలని కౌలు రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

యువత లక్ష్య సాధనకు కృషి చేయాలి

యువజన సర్వీసుల శాఖ (సెట్వెల్) సిఇఒ కెఎస్.ప్రభాకర్‌రావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

యువత ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ఆ లక్ష్యాన్ని సాధించే దిశగా కృషి చేయాలని యువజన సర్వీసుల శాఖ (సెట్వెల్) సిఇఒ కెఎస్.ప్రభాకర్‌రావు అన్నారు. యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఏ కార్యక్రమాలు చేపడుతున్నారు, యువతకు ఎలాంటి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు వంటి విషయాలను ముఖాముఖిలో ఆయన వెల్లడించారు.

ప్రశ్న : యువజనోత్సవాలు ఎలా నిర్వహించారు? ఎంతమంది ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు?

జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు నవంబర్ 11వ తేదీన ఏలూరులో, 17వ తేదీన తణుకులో నిర్వహించాం. భరతనాట్యం, ఫోక్ డాన్స్ గ్రూప్, ఫోక్ డాన్స్ సోలో, మ్యూజిక్, వంటి ఏడు అంశాల్లో రెండు జిల్లాల నుంచి 50 మంది రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. కల్చరల్‌తో పాటు సైన్స్ ఎగ్జిబిషన్, డ్రాయింగ్ అంశాల్లో కూడా పోటీలు నిర్వహించాం.

ప్రశ్న : ప్రస్తుతం యువత మత్తు పదార్థాలు, ఇతర చెడు అలవాట్లకు దగ్గరవుతున్న పరిస్థితుల్లో వారికి ఎలాంటి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు?

ప్రతినెలా పదో తరగతి, ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ఇందులో వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్, మత్తు పదార్థాల వినియోగం, సైబర్ క్రైమ్ వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించడం జరుగుతుంది. ఇందుకోసం సైకాలజిస్టుల, ఎంప్లాయిమెంట్ అధికారుల, పోలీస్, ఎక్సైజ్ అధికారుల సహకారం తీసుకొని వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం జరుగుతుంది.

ప్రశ్న : యువతకు ఎలాంటి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు? ఈ సంవత్సరం ఎంత మందికి ఉద్యోగాలు వచ్చాయి?

ఎంప్లాయిమెంట్, స్కిల్ డెవలప్మెంట్ అధికారుల సహకారంతో ఇప్పటివరకూ అనేక జాబ్ మేళాలు నిర్వహించాం. సుమారు 400 మందికి వివిధ ప్రయివేటు కంపెనీల్లో ఉద్యోగాలు పొందారు.

ప్రశ్న : యువతకు ఎన్నికల హామీల్లో చెప్పినట్లుగా నిరుద్యోగ భృతికి ఇచ్చే అవకాశం ఉందా?

ప్రస్తుతం ప్రభుత్వం నుంచి దీనిపై ఎలాంటి సమాచారం గానీ, ఆదేశాలు గాని లేవు.

ప్రశ్న: ఇంకా మండల స్థాయిలో ఏమైనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా?

మండల స్థాయిలో యువజన సంఘాలు ఏర్పాటు చేసి వివిధ ప్రభుత్వ కార్యక్రమాల్లో వారిని భాగస్వాములను చేయడం జరుగుతుంది. స్వచ్ఛభారత్, సంక్షేమ కార్యక్రమాల ప్రచారం, జిఎస్‌టి తగ్గింపు ప్రచారం, అలాగే ప్రముఖుల జన్మదినాలు, వర్ధంతిలు నిర్వహించడం వంటి వాటిలో యువతను భాగస్వామ్యం చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూడడంతో పాటు వారు కూడా వినియోగించుకునేలా చేయడం జరుగుతుంది.

ప్రశ్న : యువజన సంఘాలకు ప్రభుత్వం నుంచి ఆర్థిక ప్రోత్సాహం ఏమైనా ఉంటుందా?

ప్రస్తుతానికి ఎలాంటి ఆర్థిక ప్రోత్సాహం లేదు. ఆర్థిక ప్రోత్సాహం ఉంటే యువత ఇంకా ఉత్సాహంగా ముందుకొచ్చే అవకాశం ఉంది.

ప్రశ్న: చివరిగా యువతకు మీరిచ్చే సందేశం ఏంటి?

ప్రస్తుత పోటీ ప్రపంచాన్ని ఎదుర్కోవాలంటే యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలి. అందుకోసం చదువుతోపాటు వివిధ రంగాల్లో నైపుణ్యం సంపాదించుకోవాలి. అలాగే మొబైల్ ఫోన్, టెలివిజన్‌తో కాలం గడిపేయకుండా ఎప్పటికప్పుడు నూతన సాంకేతికతను అందిపుచ్చుకొని లక్ష్యం కోసం పనిచేయాలి. అప్పుడే ఎదుగుతారు.

చంద్రబాబు గారూ.. మా మొర ఆలకించరూ..!

రామచంద్రపురంలో శిథిలమైన మంచినీటి ట్యాంకు

నేడు గొల్లగూడెం, నల్లమాడులో సిఎం పర్యటన

ప్రజాశక్తి - ఉంగుటూరు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిసెంబరు ఒకటిన ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం గొల్లగూడెం, నల్లమాడు, గోపీనాథపట్నంలో పర్యటించనున్నారు. ఈ క్రమంలో ఆయన రాక కోసం సమీప గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. దీర్ఘకాలికంగా తిష్టవేసుకున్న పలు సమస్యలైనా సిఎం రాక అనంతరం పరిష్కారం అవుతాయని ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ మేరకు సమస్యలపై వినతిపత్రాలను సైతం ప్రజలు, నాయకులు సిద్ధం చేసుకున్నారు.

- లక్ష్మీపురం నుంచి నల్లజర్ల ఆర్అండ్‌బి రహదారి రామచంద్రపురం, గోపాలపురం, పందిరెడ్డి గూడెం, మార్లమూడి, జగన్నాథపురం మీదుగా నల్లజర్ల దారి గోతులతో దారుణంగా ఉంది. 8964 మీటర్ల ఈ రోడ్డు ప్రక్షాళనకు నిధులు కోరుతున్నారు.
- రామచంద్రపురంలో రక్షిత తాగునీటి ట్యాంకు శిథిలమై కూలటానికి సిద్ధంగా ఉంది. కొత్త ట్యాంకు నిర్మించాలి. ఇదే గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం స్లాబు పెచ్చులూడి వర్షం నీరు లీకవుతోంది. భారీ వర్షాలు కురిస్తే స్థానిక మొఘల్ చెరువు నీరు అంగన్‌వాడీ ప్రాంగణంలోకి వరద ముంపు ఉంటోంది. మెరకచేసి కొత్త భవనాన్ని నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.
- మెట్ట ప్రాంతంలో ఆయిల్ ఫామ్ తోటలు ఉన్నాయి. చెట్ల మధ్య నుంచి విద్యుత్ లైన్ల కారణంగా గెలలు కోసేటప్పుడు విద్యుత్ షాక్‌తో రైతులు, కూలీలు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల కాలంలో ముగ్గురు ప్రమాదాలకు గురయ్యారు. తోటల మధ్యలో లైను మార్చేందుకు చాలా ఖర్చు కానుందని ప్రభుత్వమే విద్యుత్ స్తంభాలను తోటల మధ్య నుంచి బయటకొచ్చేలా ఎలైన్‌మెంట్ మార్పించాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.
- రామచంద్రపురం నుంచి పుల్లపాడు వైపు పొలాల నుంచి వెళ్లే పుంత రోడ్డు అభివృద్ధి చేయాల్సి ఉంది. ఈ పుంత రోడ్డుకు ఇరువైపులా వేలాది వాణిజ్య పంటలు, వరి పొలాలు ఉన్నాయి. పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించాలంటే రైతులకు అదనపు ఖర్చులు తప్పడం లేదు. సుమారు 4.5 కిలోమీటర్ల మేర పుంత రోడ్డు వెడల్పు చేసి దారి నిర్మించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.
- నల్లమాడులో శ్మశానవాటిక చుట్టూ కాంఫౌండ్ గోడ, ఎస్‌సి కమ్యూనిటీ హాల్ నిర్మించాలి. 147 మీటర్లతో ఎస్‌సి శ్మశానవాటిక కాంఫౌండ్ వాల్ నిర్మించాలి.
- నల్లమాడులో 2146 మీటర్ల మేర సీసీ రోడ్డు, 668 మీటర్ల తారు రోడ్డు, ఎప్పుడో 40 ఏళ్ల క్రితం వేసిన పైపు లైను మార్చి కొత్తగా జల జీవన్ మిషన్‌లో కొత్త పైపులను 2356 మీటర్ల వరకూ వేయాల్సి ఉంది.
- రామచంద్రపురం ఊళ్లో 823 మీటర్ల ఆర్ అండ్‌బి సీసీ రోడ్డు, 1272 మీటర్ల పిఆర్ సీసీ రోడ్డు కోసం వినతి పత్రాలను ఇవ్వటానికి సిద్ధం చేసుకున్నారు.

ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి నిధులు ఇస్తున్నట్లు సభావేదిక నుంచి ప్రకటిస్తారనే ఆశలో మెట్ట ప్రాంత ప్రజలు ఉన్నారు.

సిఎం రాక అభివృద్ధికి మరో కీలక రాయి

పత్సమట్ల ధర్మరాజు, ఉంగుటూరు ఎంఎల్ఎ

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఉంగుటూరు నియోజకవర్గంలో ఆయన తొలి పర్యటన నేపథ్యంలో అభివృద్ధి పనులకు అంచనాలు రూపొందించాం. వాటన్నింటినీ సిఎం దృష్టికి తీసుకెళ్లి భారీగా నిధులు ఇస్తారనే ఆశతో ఉన్నాం. సిఎం రాక నియోజకవర్గ అభివృద్ధికి మరో కీలక రాయిగా నిలుస్తుందని ఆశిస్తున్నాం.

మహాసభ వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉమామహేశ్వరరావు, నేతలు

31 నుంచి అఖిల భారత సిఐటియు మహాసభ

జయప్రదం చేయాలి : రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల 31వ తేదీ నుంచి జనవరి 4వ తేదీ వరకూ విశాఖ ఉక్కు నగరంలో జరిగే అఖిలభారత సిఐటియు 18వ మహాసభను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం సిఐటియు కార్యాలయంలో జరిగిన సిఐటియు ఏలూరు జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే సిఐటియు అఖిలభారత మహాసభ విశాఖ ఉక్కు నగరంలో సిఐటియు 1970లో ఏర్పడిన తర్వాత తొలిసారిగా నిర్వహిస్తున్నామన్నారు. కార్మిక కర్షక ఉద్యోగ సంఘాల నాయకులు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి ఈ మహాసభలో పాల్గొంటారని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈ మహాసభలో చర్చించి పలు తీర్మానాలను ఆమోదిస్తారని తెలిపారు. గత మూడు సంవత్సరాల్లో కార్మిక వర్గం నిర్వహించిన పోరాటాలను సమీక్షించుకొని రానున్న కాలంలో సిఐటియు నిర్వహించే కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకొని తీర్మానాలను ఆమోదిస్తుందన్నారు. అనేక పోరాటాలతో కార్మిక వర్గం సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నవంబర్ 21వ తేదీ నుంచి కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా అమలు చేస్తున్న 4 లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకూ సమరశీల పోరాటాలకు కార్యాచరణ రూపొందిస్తుందని తెలిపారు. కార్మిక సంఘాలతో చర్చించకుండా ఏకపక్షంగా అమలు చేస్తున్న 4 లేబర్ కోడ్‌లు భేషరతుగా రద్దు చేసే వరకూ సిఐటియు కార్మిక వర్గం తరపున పోరాటాలు నిర్వహిస్తుందని, తక్షణం లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ప్రభుత్వ రంగాన్ని కాపాడాలని, రాష్ట్రంలో 12వ పిఆర్‌సి నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా కార్మిక వర్గాన్ని సమీకరించి సమరశీల పోరాటాలకు నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకూ పోరాడుతామని దానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశానికి జిల్లా ఉపాధ్యక్షులు జి.రాజు అధ్యక్షత వహించగా డిఎన్‌విడి ప్రసాద్ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సిఐటియు 18వ అఖిలభారత మహాసభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆర్‌విఎస్.నారాయణ, పి.సూర్యారావు, ఎం.నాగమణి, జె.గోపి, ఎం.ఇస్సాక్, యర్ర రాంబాబు, కమల, లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గురజాడ స్ఫూర్తితో మహిళల సమస్యలపై పోరాటాలు

ఐద్వా, బాలల రంగం, వ్యకాస ఆధ్వర్యాన వర్ధంతి సభ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మహాకవి, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు వర్ధంతి సభ ఆదివారం విజయరాయిలో ఐద్వా, బాలల రంగం, వ్యవసాయ కార్మిక రంగం ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎ.శ్యామలరాణి, పి.రామకృష్ణ మాట్లాడుతూ గురజాడ అప్పారావు మహిళల సమస్యలపై, సామాజిక రుగ్మతులపై అలుపెరగని ఉద్యమాలను నిర్వహించారని కొనియాడారు. వరకట్న వేధింపులు, సతీసహగమనం కన్యాశుల్కం, బాలికా విద్య వంటి సామాజిక సమస్యలపై ప్రజల్లో చైతన్యం కలిగించారని, ఆ మహానుభావుడు త్యాగ ఫలితంగానే మహిళలకు హక్కులు వచ్చాయని తెలిపారు. గురజాడ అప్పారావు స్ఫూర్తితో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని, సాంఘిక చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని మహిళలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు శ్రావణి, రాణి, వసంత, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అప్పలస్వామి, బాలల రంగం వైష్ణవి, గణేష్ పాల్గొన్నారు.


గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

అంగులూరు కొండ వద్ద బొలేరో బోల్తా

ఒకరి మృతి, 14 మందికి గాయాలు

ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో రాజమండ్రి తరలింపు

ప్రజాశక్తి - పోలవరం

తూర్పుగోదావరి జిల్లా దేవీపట్నం మండలం అంగులూరు వద్ద బొలేరో బోల్తా పడడంతో ఒకరు మృతి చెందారు. 14 మంది గాయాలపాలయ్యారు. వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం దొడ్డిపట్ల గ్రామానికి చెందిన 15 మంది బొలేరో వాహనంలో తూర్పు గోదావరి జిల్లా దేవీపట్నం మండలం గండి పోచమ్మ ఆలయానికి ఆదివారం మధ్యాహ్నం వెళ్లారు. దర్శనం అనంతరం అదె బొలేరో వాహనంలో తిరుగు పయాణమయ్యారు. వాహనం అంగులూరు వద్ద ఉన్న కొండ ఎక్కుతుండగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కె.నరసింహలక్ష్మీరావు మృతి చెందారు. గాయాలపాలైన 14 మందిని పోలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారిలో ఎం.సురేష్, జి.శ్రీనివాసరావులకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం రాజమండ్రి ఆసుపత్రికి తరలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న పోలవరం సిఐ బాలసురేష్‌బాబు, హెడ్ కానిస్టేబుల్ పి.శ్రీనివాసులు పోలవరం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఆర్‌టిసి బంకు ఉద్యోగులపై సస్పెన్షన్ రద్దు చేయాలి

దర్యాప్తు జరిపి నిందితులను గుర్తించాలి

రిలే నిరాహార దీక్షలకు కాంగ్రెస్ మద్దతు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ఆర్‌టిసి డిపో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులో జరిగిన రూ.82 లక్షల స్కామ్‌తో సంబంధం లేని ఉద్యోగులపై విధించిన అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని జాతీయ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు డిమాండ్ చేశారు. ఏలూరు డిపో వద్ద ఆర్‌టిసి కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించి కాంగ్రెస్ పార్టీ తరపున మద్దతు తెలిపారు. పెట్రోల్ బంక్ స్కాంపై జ్యుడీషియల్ దర్యాప్తు జరిపి నిందితులను గుర్తించాలని ఆర్‌టిసి ఉన్నతాధికారులను కోరారు. నిందితులని నిర్ధారణ కాకుండా ఉద్యోగులను ఆర్‌టిసి యాజమాన్యం సస్పెండ్ చేయడం సరికాదన్నారు. అక్రమ సస్పెన్షన్ ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని కోరారు. గత నాలుగేళ్లుగా ఆర్‌టిసి ఆయిల్ బంక్ నిర్వహణలో జరుగుతున్న లోపాలను గుర్తించడంలో ఆర్‌టిసి యాజమాన్యం నిర్లక్ష్యాన్ని ఆయన తప్పుపట్టారు. ఆర్‌టిసి ఆయిల్ బంక్ స్కాంపై జ్యుడీషియల్ దర్యాప్తునకు యాజమాన్యం ఆదేశించాలని, ఆ దర్యాప్తులో నిందితులను నిర్ధారించి వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్‌టిసి ఉన్నతాధికారులను కోరారు. దర్యాప్తు జరిగే వరకు సస్పెండ్‌కు గురైన నలుగురిని విధులకు తీసుకోవాలని ఆయన యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగులపై విధించిన అక్రమ సస్పెన్షన్ రద్దయ్యే వరకు ఆర్‌టిసి కార్మిక సంఘాల జెఎసి నిర్వహించే ఆందోళనకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ఆదివారం దీక్షలో ఎస్‌బి.అనిల్‌కుమార్, ఎ.రాఘవరావు, ఎ.రాంబాబు, శ్రీధర్, పిఎస్.చలం, వైఎస్.రావు, డి.శ్రీరాములు, కెఎన్‌విఎల్ఎస్.శ్రీరాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్‌వి.ప్రసాద్ కూర్చున్నారు.

రిలే నిరాహార దీక్షలో కాంగ్రెస్ నాయకులు

పెంచలయ్య పోరాటం యువతకు ఆదర్శం

డివైఎఫ్ఐ నివాళి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నెల్లూరు జిల్లా ప్రజానాయకుడు, డివైఎఫ్ఐ ఉద్యమ కార్యకర్త పెంచలయ్య పోరాటం యువతకు ఆదర్శమని డివైఎఫ్ఐ నాయకులు అన్నారు. స్థానిక ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం-ఏలూరు రోడ్డులో మీసేవ సెంటర్ వద్ద ఆదివారం కొవ్వొత్తులతో నిరసన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ డివిజన్ మాజీ కార్యదర్శి సూర్యారావు మాట్లాడుతూ మంచి కోసం పోరాడేవారంటే కొంతమందికి భయమన్నారు. అడవిలో ఉన్నా, ప్రజల మధ్య ఉన్నా ప్రశ్నించే గొంతుకలను నొక్కేయడం కొందరి నైజమన్నారు తమకు మృత్యువు కొత్త కాదని, అమరత్వం కొత్త కాదని, భగత్‌సింగ్ నడిపిన బాటలో తాము మళ్లీ మళ్లీ ప్రశ్నిస్తూనే ఉంటామని తెలిపారు. నెల్లూరు డివైఎఫ్ఐ అమరులైన చెంచయ్య, చలపతి, మన్సూర్‌ఖాన్‌ల వారసుడిగా, ప్రజానాట్యమండలి కళాకారుడిగా డ్రగ్స్ అంతం- డివైఎఫ్ఐ పంతం నినాదాన్ని ముందుకు నడిపిన పెంచలయ్య పోరాటం యువతకు ఆదర్శమన్నారు. 'అమరుడా పెంచలయ్య నీకు జోహార్లు నీ మరణం వృధా కాదు. నీవెత్తిన జెండాను మేము మరింత గట్టిగా పట్టుకొని మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటంలో నిలబడతాము. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య నీ ఆశయాలను కొనసాగిస్తుంది' అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నాగేంద్ర, బి.నాని, సునీల్, కె.నాని, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

రైతాంగ సమస్యలపై సిఎం దృష్టి పెట్టాలి

ఎపి రైతు సంఘం బహిరంగ లేఖ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాకు వస్తున్న సిఎం చంద్రబాబు జిల్లాలోని రైతాంగ సమస్యలపై దృష్టి సారించాలని ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ బహిరంగ లేఖలో కోరింది. ఏలూరు అన్నే భవనంలో బహిరంగ లేఖను రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారం ప్రయివేటీకరణ ఆపాలని, ఈ కర్మాగారం స్థానంలో కొత్తగా మరో ఆయిల్ ఫెడ్ కర్మాగారం నిర్మించాలని కోరారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు సాగడం లేదని, చింతలపూడి ఎత్తిపోతల ద్వారా సాగునీరు వస్తుందని మెట్ట ప్రాంత రైతులు ఎదురుచూస్తున్నారని చెప్పారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేసేందుకు తగిన నిధులు కేటాయించాలని కోరారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేసి మెట్ట ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించాలన్నారు. ఈ పథకంలో భూములు కోల్పోతున్న రైతాంగానికి ప్రయివేట్ మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ కల్పించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలన్నారు. తుపాన్ నేపథ్యంలో తేమశాతం నిబంధనలు సడలించి కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని కోరారు. కొల్లేరును ఐదు నుంచి మూడో కాంటూరుకు కుదించాలన్నారు. మొంథా తుపాను కారణంగా జిల్లాలో రైతాంగం నష్టపోయారని, వారికి వెంటనే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని పత్తి కొనుగోలుకు చర్యలు చేపట్టాలన్నారు. కౌలు రైతులను ఆదుకోవాలని కోరారు. కోకో రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా అంతర్జాతీయ మార్కెట్ ధరను అనుసంధానిస్తూ ఫార్ములా రూపొందించి కోకో గింజలకు ధర ప్రకటించాలని కోరారు. జిల్లాలోని రైతాంగ సమస్యల పరిష్కారానికి జిల్లాకు వస్తున్న సిఎం తగు చర్యలకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు.

వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిఐటియు నేతలు

సిఐటియు మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ముసునూరు

డిసెంబర్ 31 నుంచి జనవరి నాలుగో తేదీ వరకు విశాఖలో జరిగే అఖిల భారత సిఐటియు మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రమైన ముసునూరులో సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్, కంచర్ల శ్రీను, కంచర్ల రమేష్, కంచర్ల గని, ప్రసాద్, పంజుగుల పండు, తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

12, 13 తేదీల్లో పిల్లల సంబరాలు

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 12, 13 తేదీల్లో 53 అంశాల్లో సిద్ధార్థ ట్రస్ట్ స్కూల్‌లో నిర్వహించే పిల్లల సంబరాలు ఆరో కార్యక్రమాన్ని విద్యాసంస్థల వారు ప్రోత్సహించాలని ఆహ్వాన సంఘం విజ్ఞప్తి చేసింది. శలా నాగ కోటేశ్వరరావు కళ్యాణ మండపంలో ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో చర్చించిన విషయాలు, బాలోత్సవం సన్నాహాలు మీడియాకు వివరించారు. ఈ సమావేశంలో ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి దేవరకొండ వెంకటేశ్వర్లు, నిర్వాహక కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, వర్కింగ్ ప్రెసిడెంట్లు ఎంఎస్ఎంఎస్.కుమార్, మునగాల మురళీకృష్ణ, మానేపల్లి సత్యనారాయణ, ఆహ్వాన సంఘం నిర్వాహక కమిటీ సభ్యులు డి.హేమసుందర్, పీడీ రత్నాకరరావు, మేతర అజయ్‌బాబు, ఎ.మోహిని, డి.శివప్రసాద్, వి.హరినారాయణ, పివిజి.సత్యవాణి, చినమిల్లి సత్యనారాయణ, పి.రవీంద్ర, జి.రాంబాబు, పిఎస్.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, కెవి.నారాయణరావు, పి.కస్తూరిబాయ్, డివి.నరసింహారావు, పి.కనకదుర్గ, కె.జనని, వై.నిర్మల, కె.రంగనాయకి, జి.సత్యవాణి, ఎ.కోహిమా, పి.భాస్కరరావు, తదితరులు 40 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలోత్సవం పోస్టరు ఆహ్వాన సంఘం కరపత్రాలను మునగాల మురళీకృష్ణ, ఎంఎస్ఎంఎస్.కుమార్‌లు ఆవిష్కరించారు.

150 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో వైద్య సేవలను ప్రారంభించిన నేతాజీ ప్రయివేట్ హాస్పిటల్ నిర్వాహకులు, వైద్యుల సేవలు అభినందనీయమని కుక్కునూరు పంచాయ తీ ఉపసర్పంచి పిచ్చుక రాజు అన్నారు. నేతాజీ ఆసుపత్రి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని శ్లోక కాన్సెప్ట్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని వైద్యులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పిచ్చుక రాజు మాట్లాడుతూ సర్జరీల్లో లాప్రోస్కోపిక్, ఆర్థోపెడిక్‌లలో అత్యాధునిక పరికరాలతో క్లిష్టమైన ఆపరేషన్లు చేయటం అభినందనీయమన్నారు. పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఇటువంటి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిన నేతాజీ హాస్పిటల్ నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని నిరుపేద ప్రజలకు సైతం కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురా వాలనే లక్ష్యంతో, ఆధునాతన వైద్య సదుపాయాలతో భద్రాచలం పట్టణంలో నేతాజీ హాస్పిటల్‌ను స్థాపించినట్లు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో సుమారు 150 మందికి ఉచితంగా షుగర్, మోకాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, వేరికోస్ వైన్స్ తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

రాట్నాలమ్మ సన్నిధిలో చింతమనేని

ప్రజాశక్తి - పెదవేగి

పెదవేగి మండలం రాట్నాలకుంటలోని శ్రీ రాట్నాలమ్మ అమ్మవారిని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితులు ఆలయ సాంప్రదాయాలతో స్వాగతం పలికారు. ఆలయ పాలకవర్గ ఛైర్మన్ మన్నే శ్రీనివాస్ కండువా కప్పి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందించారు. ఆయనతో కలిసి ప్రముఖ న్యాయవాది మాగంటి లక్ష్మణ్ కుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు.

నేరాలు - ఘోరాలు

బైక్ ఢీకొని గాయాలపాలైన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - భీమడోలు

రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. భీమడోలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమడోలు వెలమపేట ఆవాస ప్రాంతానికి చెందిన మోయ్య వెంకటరమణ (వెంకన్న) ప్రయివేట్ ఎలక్ట్రిషియన్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 29వ తేదీన తమ స్కూటీపై భీమడోలు జంక్షన్ వైపు వెళ్తుండగా ఎదురుగా రాంగ్ రూట్‌లో వచ్చిన బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకన్నను చికిత్స కోసం విజయవాడ ఆంధ్ర హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం మృతి చెందారు. భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇరు గ్రూపుల మధ్య ఘర్షణ : పలువురికి గాయాలు

నూజివీడు టౌన్ :మండలంలోని దేవరకుంట, జంగంగూడెం గ్రామాల మధ్య ఉన్న చింతలగట్టు ఆర్ఎస్ నెంబర్-1 భూముల సాగులో నెలకొన్న వివాదం ఆదివారం ఇరు గ్రూపుల మధ్య దాడికి దారి తీసింది. ఈ దాడిలో పలువురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని నూజివీడు ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు సమాచారం సేకరించి, దర్యాప్తు చేపట్టారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

దిత్వా తుపాన్‌తో రైతుల గుండెల్లో గుబులు

చిరుజల్లులతో ఉరుకులు, పరుగులు ధాన్యాన్ని కాపాడుకునేందుకు పాట్లు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మొంథా తుపాన్ గాయం ఇంకా మానక ముందే మరో తుపాన్ గండం కష్టం రైతుకు వచ్చి పడింది. మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా తయారైంది రైతుల పరిస్థితి. తుపాన్ వస్తుందన్న ప్రచారంతో మండలంలోని రైతుల గుండెల్లో గుబులు మొదలైంది. ఆదివారం ఉదయం నుంచి చిరుజల్లులు పడడంతో రైతుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. వారం రోజులుగా తుపాన్ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మొంథా తుఫాన్‌లో రైతులు తీవ్రంగా దెబ్బతిన్నారు. దిత్వా తుపాన్ గండం వచ్చి పడడంతో నూర్పిడి చేసిన ధాన్యం రాశులు కల్లాల్లో, రోడ్లు వెంబడి ఆరబెట్టడంతో ధాన్యాన్ని రక్షించుకునేందుకు రైతులు ఉదయం నుంచి పొలాల వైపు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. మొంథా తుపాన్ దెబ్బకు పంట దిగుబడులు బాగా తగ్గాయి. మిగిలి ఉన్నా పంట దెబ్బ తినడంతో తేమ శాతం బాగా పెరిగింది. 17 శాతం నిబంధన వల్ల రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి పనుల్లో రైతులు ఉన్నారు. ఈ తరుణంలో వాతావరణంలో మార్పులు వచ్చి చిరుజల్లులు పడడంతో రైతులు హైరానా పడుతున్నారు. యంత్రాల ద్వారా కోసిన పంటను ఆరబెట్టకుండా నేరుగా మిల్లుకు తరలించే పనుల్లో రైతులు హడావుడిగా ఉన్నారు. రోడ్లు వెంబడి, పొలాల్లో, ఖాళీ ప్రదేశాన్ని ఆరబెట్టిన ధాన్యాన్నికి పరదాల కప్పి వర్షానికి తడవకుండా రక్షణ చర్యలు చేపడుతున్నారు. తుపాన్ ఎఫెక్ట్‌తో కోసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలో ముందుగా వెదజల్లిన చేలు కోతకు రావడంతో

ముదినేపల్లిలో ధాన్యపు రాసులపై కప్పిన పరదాలు

రైతులు మాసూళ్లు ప్రారంభించారు. ప్రస్తుతం మాసూళ్లు ముమ్మరంగా జరుగుతున్న ఈ తరుణంగా తుపాన్ వార్తలతో రైతులు రోడ్ల వెంబడి కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని, ట్రాక్టర్ ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించి పరదాల కప్పుతున్నారు. కొందరు రైతులు ట్రాక్టర్లలో, లారీల్లో ధాన్యాన్ని లోడ్ చేసి మిల్లులకు తరలించే పనులు చేపట్టారు. పలు గ్రామాల్లో కోతలు కోసిన వరి పైరు పనులపై ఉంది. మండల వ్యాప్తంగా ఇప్పటివరకు ఏడు మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. మండలంలో 14,500 ఎకరాల్లో సార్వా వరి సాగు చేయగా, ఇప్పటివరకు మూడు వేల ఎకరాల్లో కోతలు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. మండల వ్యాప్తంగా వంద ఎకరాల్లో మాత్రమే కోసిన వరి పైరు పనులపై ఉన్నట్లు వ్యవసాయ శాఖాధికారి వేణుమాధవ్ తెలిపారు.

ముసునూరు :గత తుపాన్ వల్ల నష్టపోయి ఇప్పడే ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో మళ్లీ తుపాన్ వచ్చే అవకాశం ఉందని హెచ్చరికలతో, వాతావరణంలో మార్పులు రావడంతో రైతుల గుండెల్లో గుబులు మొదలైంది. గత రెండు రోజుల నుంచి జల్లులు పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి పంట కోసి కల్లాల్లో ఉండటం, కొన్ని ఎకరాల్లో వరి కోతకు వచ్చి పంట చేతికొచ్చే సమయంలో తుపాన్ వల్ల నష్ట పోయే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. గత నెలలో వచ్చిన తుపాన్ ప్రభావంతో దిగుబడులు కుడా తగ్గిపోయాయి. ఇప్పుడు మళ్లీ తుపాన్ వస్తే పూర్తిగా దెబ్బతినే పరిస్థితి ఉందని ఆందోళన చెందుతున్నారు. కొందరు రైతులు కోసిన పంటను ఆరబెట్టందుకు నానా తంటాలు పడుతున్నారు. పంట విత్తనం మొదలు కోసే వరకు వేల రూపాయాలు పెట్టుబడి పెట్టామని రైతులు వాపోతున్నారు. మరోపక్క రబీ సీజన్ మొదలు కావడంతో మొక్కజొన్న, పొగాకు పంట సమయం కావడంతో నాటు ప్రారంభమవుతాయని, తుపాన్ ప్రభావంతో వర్షం వస్తే విత్తనాలు మొలక సరిగ్గా రాకపోవడం, పొగాకులో వేరుకుళ్ల తెగులు ఆశించడం వంటివి వచ్చి మరింత నష్టపోయే పరిస్థితి రైతులు వాపోతున్నారు.

దిగుబడి తగ్గింది

తులిమెల్లి సుబ్బారావు, రైతులు

గత నెలలో తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షం వల్ల తక్కువ దిగుబడులతో నష్టపోయాం. గతంలో ఎకరానికి 35 నుంచి 40 బస్తాలు కాగా, ప్రస్తుతం 25 నుంచి 33 బస్తాల దిగుబడి వస్తుంది. పెట్టిన పెట్టుబడులు కూడా రాక నష్టపోయే పరిస్థితి ఉంది.

పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు

కట్టుబోయిన రాంబాబు, కౌలు రైతు

ఎకరానికి కౌలు రూ.25 వేలు కట్టి పంట పెట్టుబడి ఖర్చు సుమారు రూ.30 వేలు పెట్టినా కనీసం ఖర్చులు వచ్చే పరిస్థితి లేదు. ఇలాంటి సమయంలో తుపాన్ హెచ్చరికలతో కౌలు రైతు చాలా నష్టపోయే పరిస్థితి ఉంది.

నేడే నల్లమాడు, గోపీనాథపట్నంలో సిఎం పర్యటన

చవరి నిమిషం వరకూ కొనసాగిన హెలిప్యాడ్ పరిసర ప్రాంతాల చదును పనులుచిరుజల్లులతో అవస్థలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

రైతన్న మీకోసం బహిరంగ సమావేశం, ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, టిడిపి కేడర్‌తో ముఖాముఖి సమావేశం కోసం సోమవారం సిఎం పర్యటన కోసం వర్షాన్ని సైతం లెక్కచేయకుండా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. చేబ్రోలు- దూబచర్ల ఆర్అండ్‌బి మార్గంలో రోడ్డు పక్కన నల్లమాడు పంచాయతీకి చెందిన ఓ రైతుకు చెందిన పొలంలో హెలిప్యాడ్ నిర్మించారు. దాని చుట్టూ వరి పొలాలు కావడంతో శనివారం సాయంత్రం ఛాపర్ ట్రయిల్ రన్ వేసినప్పుడు దుమ్ము, వరి గడ్డి పైకి గాల్లోకి లేచాయి. దీంతో హెలిప్యాడ్‌ను విస్తరించి దానిచుట్టూ మడులను సైతం మట్టితో పూడ్చి చదును చేసే పనులు ఆదివారం సాయంత్రం వరకూ కొనసాగుతూనే ఉన్నాయి. ఒక పక్క చినుకులు పడటంతో పనులకు ఒక దశలో ఆటం కం ఏర్పడినా అలాగే పనులు కొనసాగించారు. మట్టి లారీ లతో రోడ్డు జారుడుగా మారాయి. కాగా సిఎం బందోబస్తు కోసం వచ్చిన పోలీసులు, అధికారులు, సిబ్బంది వర్షానికి తడుస్తూ అవస్థలు పడాల్సి వచ్చింది. సిఎం పర్యటన సందర్భంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎంఎల్ఎ ధర్మరాజు పర్యవేక్షణ చేశారు.

సిఎం ట్రయిల్ రన్ సక్సెస్

హెలిప్యాడ్ నుంచి సిఎం పర్యటించే ప్రాంతాల్లో కాన్వాయ్‌తో ట్రయిల్ రన్ నిర్వహించారు. తొలుత హెలి ప్యాడ్ నుంచి బయలు దేరిన కాన్వాయ్ గోపీనాథప ట్నంలో డయాలసిస్ పేషెంట్ ఇంటికి వెళ్లింది. అక్కడనుంచి నల్లమాడులో రైతన్న మీకోసం సభ వేదికను సందర్శించారు. గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థశారధి, ఐజి అశోక్ కుమార్, కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పి ప్రతాప్ శివ కిషోర్, ఎంఎల్ఎ ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజ నేయులు, జెసి అభిషేక్ గౌడ, ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్ ఉన్నారు.

నేడు సిఎం పర్యటన ఇలా...

ఉదయం 10.30 గంటలకు ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో సిఎం బయలు దేరుతారు. 10.55 గంటలకు నల్లమాడు చేరుకుంటారు. 10.55 నుంచి 11.10 గంటల వరకు ప్రజాప్రతినిధుల నుంచి వినతులు స్వీకరిస్తారు. 11.20 గంటలకు గోపీనాథపట్నం వెళ్లి డయాలసిస్ బాధితురాలి ఇంటికి వెళ్లి పింఛను సొమ్ము పంపిణీ చేయనున్నారు. 11.50 గంటలకు నల్లమాడులో ప్రజావేదిక ప్రాంతానికి చేరుకుని 11.50 నుంచి 11.55 గంటల వరకు వివిధ స్టాల్స్ పరిశీలిస్తారు. 11.50 నుంచి 1.25 గంటల వరకూ ప్రజావేదిక సమావేశంలో పాల్గొంటారు. 1.25 నుంచి 1.40 గంటల మార్గదర్శకులు, బంగారు కుటుంబాలతో మాటామంతీ, 1.40 నుంచి 2.10 గంటలకు రిజర్వుడు, 2.15 నుంచి 3.45 గంటల వరకు టిడిపి కేడర్ మీటింగ్‌లో పాల్గొంటారు. 3.55 గంటలకు హెలికాప్టర్ ఎక్కి ఉండవల్లి నివాసానికి వెళ్తారు.

సిఎం బందోబస్తు పై పోలీసులకు ఎస్‌పి బ్రీఫింగ్

సిఎం చంద్రబాబు సోమవారం ఉంగుటూరు మండలం నల్లమాడు, గోపీనాథపట్నం పర్యటన నేపథ్యంలో ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ పోలీస్ అధికారులతో బందోబస్తు ఏర్పాట్లపై ఆదివారం బ్రీఫింగ్ నిర్వహించారు. కార్యక్రమం మొత్తం వ్యవధిలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. హెలిప్యాడ్, కాన్వాయ్ రూట్, ప్రజా వేదిక పరిసరాల్లో భద్రతా చర్యలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. కాన్వాయ్ వచ్చే సమయంలో రూట్ బందోబస్తు సిబ్బంది అత్యంత జాగ్రత్తగా ఉండాలని వివరించారు. సిబ్బంది క్రమశిక్షణతో, ప్రజలతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. వాహనాలను కేటాయించిన పార్కింగ్ స్థలాల్లోనే నిలుపుకోవాలని తెలిపారు. ఎస్పి కాన్వాయ్ రిహార్సల్స్‌ను స్వయంగా పరిశీలించారు.

విద్యార్థుల విజ్ఞాన యాత్ర

ప్రజాశక్తి - దెందులూరు

విద్యార్థులకు మెరుగైన విద్యా ప్రమాణాలు అందించడంతో పాటు వారికి విజ్ఞాన యాత్రల ద్వారా కూడా మరింత విజ్ఞానాన్ని అందిస్తూ, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలుస్తుందని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. మండలంలోని కొవ్వలిలోని ఎస్‌విఎస్ఆర్‌బి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ స్కూల్ విద్యార్థుల విజ్ఞాన యాత్ర బస్సును దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి విద్యార్థుల నుంచి ఎంఎల్ఎ గౌరవ వందనాన్ని స్వీకరించారు. విజ్ఞాన యాత్ర ద్వారా రాష్ట్రంలోని అమరావతి రాజధానిలోని ప్రాంతాలతో పాటు పలు ముఖ్యమైన ప్రదేశాలను విద్యార్థులు సందర్శించేలాగా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ఇటువంటి విజ్ఞాన యాత్రలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా విజ్ఞాన యాత్రకు బయలుదేరే ముందు విద్యార్థులందరికీ దుగ్గిరాలలోని ఎన్‌టిఆర్ చింతమనేని జనతా క్యాంటీన్ ఆధ్వర్యంలో అల్పాహార విందును ఎంఎల్ఎ చింతమనేని ఏర్పాటు చేశారు.

'మానవత' సేవలు మరింత విస్తరించాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరులో ఆనంద్ నిలయం పూర్తి చేయడానికి అందరూ సహకరించాలని మానవత ఉంగుటూరు మండల ఛైర్మన్ గుణ్ణం బులెబ్బాయ్ కోరారు. ఆదివారం ఉంగుటూరులో నిర్వహించిన మానవత నెలవారీ సమావేశానికి అధ్యక్షత వహించి ఆయన మాట్లాడారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రాంతీయ ఛైర్మన్ పుప్పాల గోపీ మాట్లాడుతూ మానవతా సభ్యులుగా ఎక్కవ మంది చేరి సేవలు అందించాలని కోరారు. సమావేశంలో మండల కన్వీనర్ అడపా శ్రీనివాసరావు, కార్యదర్శి గంజి రవి, కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, బొమ్మిడి అప్పారావు, శీతాల సత్యనారాయణ, గురివెల్లి రాజారావు, రామిరెడ్డి వెంకటరెడ్డి, కొండ్రెడ్డి శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గుండె వ్యాధుల పరీక్ష శిబిరం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు లయన్స్ క్లబ్, ది ఏలూరు జ్యువెలర్స్, బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత గుండె వ్యాధుల పరీక్ష శిబిరం సిరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ది ఏలూరు జ్యువెలర్స్, బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డెర్మటాలజీ గోల్డ్ మెడలిస్ట్, విజయ స్కిన్ హాస్పిటల్ డాక్టర్ డి.సుబ్బారావు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. బిపి, షుగర్ పరీక్షలు, అవసరమైన వారికి ఇసిజి, 2డి ఎకో పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కడియం ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ప్రజలకు అవసరమయ్యే విధంగా క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు విరివిగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.శ్రీనివాస్, తమ్మన మధుసూదన్‌రావు, కె.బాలసుబ్రహ్మణ్యం, నంగులూరి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పోలవరం అభివృద్ధి పట్టించుకోని ప్రభుత్వాలు

కాంగ్రెస్ పోలవరం నియోజకవర్గ కన్వీనర్ విజయభాస్కర్

ప్రజాశక్తి - పోలవరం

మాట్లాడుతున్న కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ విజయభాస్కర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరాన్ని అభివృద్ధి చేస్తాయనే ఈ ప్రాంత వాసుల ఆశలను నిరాశగా మిగులుస్తున్నారని కాంగ్రెస్ పార్టీ పోలవరం నియోజక వర్గ కో-ఆర్డినేటర్ బండి విజయభాస్కర్ అన్నారు. పోలవరంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం పోలవరం జిల్లా సాధన సమితి నాయకులు నాళం గాంధీ, బుగ్గా మురళీ కృష్ణ, అడ్వొకేట్ సొబ్బన ఆనందరావు, సొబ్బన మోహన్‌లతో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం జిల్లా సాధన సమితి వారు చేస్తున్న ఉద్యమానికి పూర్తి మద్దతు ఇస్తున్నామన్నారు. పోలవరం జిల్లా ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. పోలవరం లేని జిల్లా ఏమిటని ఎద్దేవా చేశారు. పోలవరం జిల్లా చేయాలనే విషయం పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిలా దృష్టికి తీసుకెళ్తామన్నారు. పోలవరం జిల్లా సాధన సమితి నాయకులు నాళం గాంధీ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల గ్రామాలు తరలిపోయి నష్టపోయిన వర్తక వ్యాపార వాణిజ్యాలు, కూలీలు, కార్మికులు వలసపోయే పరిస్థితులు ప్రస్తుతం ఉన్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి జిల్లా ఏర్పాటులో పోలవరం నియోజకవర్గం మండలాలను కలిపి పోలవరం మండలాన్ని జిల్లా కేంద్రంగా చేయాలని డిమాండ్ చేశారు. బుగ్గా మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లా ఏర్పాటుపై స్పందించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని, ఆమరణ నిరాహార దీక్షలకు సైతం వెనకడబోమన్నారు. జిల్లా సాధన సమితి నాయకులు సొబ్బన ఆనంద్, సొబ్బన మోహన్, రాజశేఖర్ బాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షురాలు ముచ్చిక సీత, బుట్టాయగూడెం మండలాధ్యక్షులు బాబూరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవా సంస్థల సేవలు అభినందనీయం

ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు

విద్యార్థులను అభినందిస్తున్న ఎంఎల్ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - భీమడోలు

సత్యసాయి సేవా సంస్థలు స్వచ్ఛందంగా చేపడుతున్న విద్య, ఆరోగ్య, సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. భీమడోలుకు చెందిన శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సాయిబాబా శత వర్ష జన్మదినోత్సవ వేడుకల కార్యక్రమాన్ని ఆదివారం భీమడోలులో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఉంగుటూరు ఎంఎల్ఏతో పాటు, సేవా సమితి జిల్లా అధ్యక్షులు కానుమిల్లి శశి శేఖరరావు హాజరయ్యారు. ఉదయం నగర, నామ సంకీర్తనలతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. బాల వికాస్ పిల్లలు ప్రదర్శించిన మార్పు నాటిక, నృత్యాలతో కూడిన దశావతారాల కార్యక్రమం, ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు పలువురుని ఆకట్టుకున్నాయి. నారాయణ సేవ పేర పేదలకు దుస్తులు, ఇతరాల పంపిణీ కార్యక్రమాన్ని ఎంఎల్ఎ ప్రారంభించారు. భీమడోలు సమితి చేస్తున్న సేవలను ప్రత్యేకంగా అభినందించారు. సత్యసాయి బోధనలు అందరికీ ఆచరణీయమని తెలిపారు. సాయంత్రం వైద్య, ఆరోగ్యశాఖ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల విశ్రాంత కమిషనర్ డాక్టర్ నాగార్జున ఆధ్వర్యంలో సాయిబాబా జన్మదిన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ గిరి, జనసేన పార్టీ నాయకులు పత్తి మదన్, కూటమి నాయకులు యుగంధర్, భీమడోలు సమి తికి చెందిన వర్ధినీడి వెంకటేశ్వరరావు(సత్య సాయి) పాల్గొన్నారు.

గుండె ఆరోగ్యం విషయంలో శ్రద్ధ అవసరం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

విద్యార్థులను అభినందిస్తున ప్రముఖులు

గుండె సంబంధిత ఆరోగ్య విషయంలో ప్రతిఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని ప్రముఖ గుండె వైద్య నిపుణులు కొల్లూరి లక్ష్మణరావు చెప్పారు. మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో ఉన్న ఆరోగ్య ఆసుపత్రి వద్ద ఆదివారం కొయ్యలగూడెం మండల ప్రింట్, ఎలక్ట్రానిక్ విలేకర్లకు ఉచిత గుండె వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ రెండు కిలోమీటర్ల వరకు నడవాలని, తీసుకునే ఆహారపు అలవాట్లలో కూడా మార్పు చేసుకోవాలని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న విలేకర్ల ఆరోగ్య విషయంపై ఉచిత గుండె పరీక్షలు నిర్వహించారని తెలిపారు. ఉచిత గుండె వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ లక్ష్మణ్‌ను ఎపియుడబ్ల్యూజె ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో చిరు సత్కారాన్ని చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణబాబు, సెక్రటరీ సిరిబత్తుల సురేష్, గెలం దుర్గాప్రసాద్, సాయిబాబా, అరుణ్‌కుమార్, బొబ్బర్ కిషోర్, షేక్ అలీమ్, చిటికెన రమేష్, మన్నే దుర్గబాబు, శ్రీహరి, సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

దిత్వా తుపాన్ ప్రభావం నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ వెంకటరమణ, తహశీల్దార్ స్లీవజోజి, వ్యవసాయాధికారి పవన్‌కుమార్ సూచించారు. వారు మండలంలోని లక్కవరం, పంగిడిగూడెం, పేరంపేట, గురువాయిగూడెం, తెక్కినవారిగూడెం గ్రామాలను ఆదివారం సందర్శించారు. తుపాన్ నేపథ్యంలో కలిగే నష్టాలను, నివారించేందుకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులు వివరించారు. ఇప్పటికే కోతకు సిద్ధంగా ఉన్న పంట కోతలను తాత్కాలికంగా ఆపాలని సూచించారు. కళ్లల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే సంచుల్లో నింపి సురక్షితమైన ప్రదేశాల్లో నిల్వ చేయాలని సూచించారు. తగిన తేమ శాతం ఉన్న ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా సమీప మిల్లులకు పంపించాలన్నారు. ఈ మేరకు సంబంధిత రైతు సేవా కేంద్ర సిబ్బందికి తగిన సూచనలు చేశారు. రైతులకు అండగా ఉంటామని, అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

నూజివీడు టౌన్ :తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు మరో మూడు రోజులపాటు వరి కోతలు కోయవద్దని మండల వ్యవసాయాధికారి పలగాని చెన్నారావు సూచించారు. రైతులందరూ అప్రమత్తంగా ఉండి ఇప్పటికే వరి కోత కోసి పనల మీద ఉన్నవాటిని కుప్పలు వేయాలని, పంట నూర్చిన వారు రైతుసేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు తమ ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలు అన్ని వేళలా అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతులకు అవసరమయ్యే టార్పాలిన్లు కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. క్షేత్ర స్థాయి లో పర్యటించిన వ్యవసాయాధికారి తుపాను హెచ్చరికలతో రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని తెలియచేస్తూ రైతులకు ధాన్యం నిల్వ పద్ధతులపై అవగాహన కల్పించారు. వరి పంట కోసిన రైతులు పొలంలోనే కుప్పలు వేసి వర్షపు నీరు చేరకుండా చుట్టూ కందకాలు తీయాలని సూచించారు.

చింతలపూడి : రైతులు ధాన్యం తడవకుండా తగిన చర్యలు తీసుకోవాలని చింతలపూడి ఎఎంసి ఛైర్‌పర్సన్ దుర్గా పార్వతి మధుబాబు సూచించారు. రైతులకు ఆదివారం ఆమె టార్పాలిన్లు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు గోనెసంచులు అందుబాటులో ఉంచాలన్నారు. రేపు కామవరపుకోట, జంగారెడ్డిగూడెం మండలాల్లో టారాలిన్లు అందిస్తామన్నారు. అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని కోరారు.

పలు గ్రామాల్లో 'రైతన్న మీకోసం'

ప్రజాశక్తి - పెదవేగి

రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ఆదివారం పెదవేగి మండలంలోని రాట్నాలకుంట, రాయన్నపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధి పొందిన రైతన్నలకు కూటమి ప్రభుత్వం తరఫున సిఎం చంద్రబాబునాయుడు పంపిన అభినందన లేఖలను స్వయంగా రైతులకు అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చింతమనేని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతన్నల సంక్షేమానికి అన్ని విధాలా అండగా నిలుస్తున్నామని చెప్పారు.

సింగరాయపాలేనికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

షష్ఠి కల్యాణోత్సవాల్లో భాగంగా మండలంలోని సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలకు యాత్రికులు పోటెత్తారు. వేలాది మంది యాత్రికులు తరలిరావడంతో సింగరాయపాలెం సెంటర్ కిటకిటలాడింది. ఆదివారం సెలవు కావడంతో వ్యాపారులు, ఉద్యోగులు, వివిధ రంగానికి చెందిన కార్మికులు, రైతులు, యువత వేలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవ స్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి, ఉత్సవ కమిటీ సభ్యులు బొంగు రవికుమార్, పరసా కృష్ణ, బెజవాడ నాగ వెంకట రాధాకృష్ణ, ఉప్పలపాటి విమల, దగాని నాగలక్ష్మి తదితరులు పర్యవేక్షించారు. పెదన ఎంఎల్ఎ కాగిత కృష్ణప్రసాద్ దంపతులు, టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు దంపతులు, మాజీ జెడ్‌పిటిసి రత్నకుమారి దంపతులు, పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు.

పాస్‌పోర్టు పోయినది

GODI PEDDA RAJU అనునాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది.25-05-2011న J6381597 నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్స్ తీయించుకునేందుకు మా ఇంటి నుండి నరసాపురం టౌన్‌లోని మెయిన్‌రోడ్‌కు వస్తుండగా నా ఒరిజినల్ పాస్ పోర్టు పోయినది. గాన నా ఒరిజినల్ పాస్‌పోర్టు ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది చిరునా మాకు అందించగలరని కోరుతున్నాను.

GODI PEDDA RAJU
S/o.Godi Bheema Raju, D.No.2-117,
Yerramsetti Vari Palem, Lakshmaneswaram Post
Narasapur Mandal, W.G.Dt., A.P

పాస్‌పోర్టు పోయినది

వల్లూరి దివ్య, భర్త: వినోద్ కుమార్ వల్లూరి డోర్ నెంబర్ 9-137, ధవళేశ్వరం, రాజమండ్రి రూరల్ మండలం, తూ.గో.జిల్లా, ఎ.పి ప్రజలకు తెలియజేయునది ఏమనగా

నేను ది 12-10-2017లో వైజాగ్ పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి నెంబర్ R5897556, పాస్ పోర్ట్ పొందియున్నాను. ది 14-11-2025 న మా ఇంటి నుంచి పోడూరు మండలం లోని జిన్నూరు జెరాక్స్ సెంటర్‌కు నా పాస్ పోర్ట్ జెరాక్స్ తీయించుటకు, పాస్ పోర్ట్ రెన్యువల్ గురించి మాట్లాడటానికి బైక్ పై వెళుతుండగా దారిలో నా ఒరిజినల్ పాస్ పోర్ట్ పడి పోయినది. ఎంత వెతికిన ఎక్కడ దొరకలేదు.ఎవరికైన దొరికిన పై నా అడ్రస్ కు నా ఒరిజినల్ పాస్ పోర్ట్ అందజేయగలరు.

నా సెల్ నెంబర్ 9866003631